# రేముక్క - పగలుముక్క

తారామూర్తి

ఇటువంటి సంఘటనలు యీనాడు దేశంలో, ముఖ్యంగా ఆంధ్రలో అనేకమైనవి జరుగుతున్నాయి కాని అడిగేదాత తీర్చేత్యాగి లేడు మనరోజులు బాగోలేనంతకాలం, మన కర్మని నిందిస్తూ, మన నాయకుల ఉపన్యాసాలు వింటూ కాలక్షేపం చేసుకుందాం కాని భావప్రకటన మన జన్మహక్కు కాబట్టి జరిగిన సంఘటన నివేదిస్తాను

*　　*　　*　　*

పేపరు నేలకివేసి కొడదామనిపించింది ఒకటీ పనికొచ్చేవిషయం లేదు పేపరంతా, కొరియాయుద్ధంగురించే ఆకలి మరణాలగురించే కాని ఆరోజు లక్ష్మివారం కనుక పజిల్ ఫలితాలు చూస్తూ కూర్చున్నాను యింతలో కేకలు "బాబూ　　" నేను వినిపించనట్లే ఊరుకున్నాను

"తల్లీ! రాజుల తల్లీ　రతనాల తల్లీ, అన్నపూర్ణాదేవీ　ఆకలి తల్లీ　అన్నం లేక నాల్గురోజులనుండీ　కనికరించు తల్లీ　" యింకా అరుస్తున్నాడు

"పోరా దుక్కలాగున్నావు కూలి చేసుకో" అన్నాను పేపరు అడ్డు తియ్యకుండానే

"లేదు దొరా! పుట్టుగుడ్డోణ్ణి! మీ కడుపున పుడతాను దొరా! రెండుగింజలు వెయ్యండి!" పేపరు ముఖానికి అడ్డుతీశాను చింకి లాల్చీ చేతులో జోలె వాడి వెనకాతలే, ఒక చిన్న కుర్రవాడు వాడికి సహాయం కాబోల్సు లోపలికి వెళ్లి బియ్యండబ్బా చూశాను ఖాళీ నా తెలివితక్కువతనానికి నాకే నవ్వు వచ్చింది పూర్వంరోజులు కనుక నా బియ్యం బస్తాలతోనీ, డబ్బాలతోని ఉండటానికి శ్రీమతిని పిల్చాను "కామేశ్వరీ　" కామేశ్వరి ఎసట్లో బియ్యం పోసింది కాబోల్సు కలుపుతున్న గరిటతోనే వచ్చింది

"ఏమండీ అంత తొందరగా పిలచా" రన్నది పైటచెంగు మొంకి దోపుతూ

"బియ్యం ఉండాలి పెట్టిలో" అన్నాను

"ఆం మీరు తెస్తారు కదూ బస్తాడు పాతబియ్యం అవి నిన్న ఉన్నాయి పాపం'

ఆదెబ్బ నాకే తగిలింది

"నా ప్రయోజకత్వానికి నువ్వు నన్ను హేళన చెయ్య నవసరం లేదు కాని, తవ్వలో పోసి కాసిన్ని బియ్యం యియ్యి" అన్నాను

"బాగుంది వరస! యింక ముష్టివాళ్లకి కాబోల్సు యీరాత్రికి మనం బియ్యానికి బయలుదేరాలి బియ్యం నిండుకున్నాయి" అన్నది

నాగుండెల్లో రాయిపడింది యింకా ఆరోజు లక్ష్మివారం అంటే శుక్ర, శనివారాలు పూర్తిగా గడవాలి నాకంటే శనివారం నియమం కామేశ్వరికి లేదుగా నేనే వెళ్లి తవ్వచూశాను అందులో చారెడుబియ్యం ఉన్నాయి

"కామూ, యిందులో ఉన్నాయే బియ్యం ?"

"నాకు నమలడానికి కావాలం"డీ అన్నది గర్భిణీస్త్రీలకి ఏదో నములటం అలవాటు కాబోల్సు "సరేలే చూద్దాం" అని ఆబియ్యం ముష్టివానికి వేశాను

'మీ కుటుంబం వర్ధిల్లాలండీ" అంటూ



వెళ్ళిపోయాడు. నేను నాలో నవ్వుకున్నాను.

నేను బియ్యం ఎట్లా సంపాదించడమా అని ఆలోచనలో పడ్డాను. నాకు సమయానికి వెంకటేశ్వరరావు జ్ఞాపకానికి వచ్చాడు. యింతకు పూర్వం వెంకటేశ్వరరావు "బియ్యం కిట్టుబాటయిన ధరకి యిప్పిస్తా" నన్నాడు. కాని తీరా ఆరోజు ఆఫీసుకి వెంకటేశ్వరరావు రాలేదు. యింటికి కబురు పంపితే "ఊరు కెళ్లారు" అని వార్త. ఆఫీసులో అంతా యిదే ఆలోచన. తండులాన్వేషణ ఎలాగా అని.

సాయంత్రం యింటికొచ్చేసరికి కామేశ్వరి సంచీ అందించింది. "బియ్యం పట్రాండి" అని. కాని ఎలాగు? అన్న విషయం అక్కరలేదు ఆడజాతికి. సంచీ పట్టుకొని బయల్దేరాను. ఎక్కడ తేవడం? యింతకీ ఆరాత్రికో? తిరిగి వెనక్కి వెళ్లాను. "యీరాత్రి మాటో?" అన్నాను శ్రీమతితో.

"యిందాకట్ల పక్కింటి క్రిష్ణవేణ గోధుమలు ఎండికొట్టించాను. రొట్టెలు చేస్తా" నన్నది.

ఆ నల్లమార్కెట్ జరిగేచోటు మాయింటికి రెండుమైళ్లు. కాని విధి! అసలు అన్ని పాపాలలోనూ బ్రాహ్మణ జాతిలో మొగవాడై పుట్టటం పరమ పాపం. అందులోను పుట్టి ఎన్ జి ఓ కావటం మరీ పాపం. వెళ్తూఉంటే దారిలో జట్కా ఎదురయింది. అందులో గుణవతి, రామం. వదినగారికి గుణవతి నా అక్కడాన్లోనే పలకరించింది 'ఏం తమ్ముడూ?" అని. అంటే ముక్కాంమాయింట్లో నేఅన్నమాట "వెళ్లండి. మీ మరదలు యింట్లో ఉన్నాది. వస్తా" నన్నాను. వడివడిగా నడవటం ప్రారంభించాను. ఆ స్థలం చేరుకొనేసరికి చీకటి పడ్డాది. అది పెద్ద మైదానం.

వరుసగా బుట్టలలో పెట్టుకొని కూర్చున్నారు. నేను వెళ్లేసరికి "బాబూ! బాబూ" అన్నారు. ఒక తట్టని సమీపించాను.



"ఎంతోయి సేరు?" అన్నాను.

"అరణాలు బాబూ" అన్నాడు.

ఆశ్చర్యపోయాను. ఇంత చవుకా అని. ప్రక్కాయన అన్నాడు "అంటే రూపాయిమీద అరణాలని." అది అక్కడి టెర్మినాలజీ అన్నమాట. నా గుండెలో రాయిపడింది. కనీసం నాల్గు శేర్లంటే కాని, మర్నాడు గడువదు. నాల్గుశేర్లకి డబ్బులిచ్చి "యిందులో పొయ్యవోయ్" అన్నాను. అవ్యక్తి తలెత్తి నావైపు చూశాడు. ఆశ్చర్యం! వాడు పొద్దున్న మాయింటికొచ్చిన ముష్టివాడు. వాడు నన్ను పోల్చుకోలేకపోయాడు! దొంగవెధవ! పుట్టుగుడ్డి అన్నాడు. కాని అర్ధరాత్రయినా ఆనవాలు కట్టగలడు మనిషిని!! యిల్లు చేరుకున్నాను. ఆరాత్రి పూర్తిగా అన్నం తిన్నాం. ఆశ్చర్యపోయాను. నేను బియ్యం తెచ్చేసరికి వంట అయిపోయింది. రాత్రి అడిగాను కామేశ్వరిని "ఎక్కడివి బియ్యం?" అని.

"శేషగిరిరావుగారి ఆఫీసరు భార్య యిచ్చింది" అన్నది.

"అప్పుగానా?" అన్నాను.

"కాదు. శేరు రూపాయిన్నర" అన్నది. నాకేమీ తెగలేదు. ప్రభుత్వోద్యోగులే యిలా చేస్తే యింక న్యాయం ఏదీ?

* * * *

ఆ మర్నాడు పేపరు చదువుతూ ఉంటే వచ్చాడు వాడు "బాబూ పుట్టుగుడ్డోణ్ణి." గుణవతిని, కామేశ్వరిని, రామాన్ని పిల్చి అంతా చెప్పాను.

"ఓ! యిదా! మా ఊళ్లో కూడా మామూలే! నీకెంత పంచదార కావల్సినా తాసిల్దారుపెళ్లాం వీశ 3 0-0 కి, ఎన్ని బియ్యం కావల్సినా శేషగిరిరావు ఆఫీసరు భార్య శేరు 1 8 0 కి సప్లయి చేస్తా" రన్నాడు.

నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు.

—